

# దయ్యం

పి.వి. సునీల్‌కుమార్

తెలుగు నేర్చుకున్నాక అంత అందమైన వాక్యాలను చదవడం అదే మొదలు యువరాజుకి. అంటే అతగాడేదో పెద్ద చదవరి అనికానీ, బమ్మెర పోతన, తిక్కన సోమయాజి, అల్లసాని పెద్దనల రచనా సౌరభాలను ఆఘ్రాణించేశాడనీ, వారి రాతల తరువాత ఈ రాతలు అంత అందంగా ఉన్నాయనీ కాదు.

అసలా మాటకొస్తే అతడికి కనీసం వేటూరి సుందరరామమూర్తి, 'ఆరేసుకోబోయి పారేసుకున్నా' అనే కీర్తన రాశాడని కూడా తెలీదు. 'ఆజారే ఆరీను రాజారే ఇస్పేటును కిస్ పెట్టరే' అనేది తేటతెలుగు జావళి అని కూడా తెలీదు.

అక్షరాస్యత మాత్రమే ఉండి చదవడం, రాయడం మరిచి పోయిన చాలామంది తెలుగువాళ్ల లానే అతడికి భాష అంటే బస్సెక్కడానికి, కావల్సింది కొనుక్కోడానికి ఓ సాధనం.

ఇక్కడ అతడికి కనిపించింది చిన్న బోర్డు. దాని మీద 'సెక్యూరిటీ గార్డులు కావలెను. పైకి దరి' (అచ్చు తప్పు కాదు, అక్కడ అలానే రాసి ఉంది) అన్న రెండు వాక్యాలు యువరాజుకి చాలా అందంగా కనపడ్డాయి.

పైకి రమ్మన్నది మేడ మీదకే అయినా జీవితంలో పైకి రమ్మన్నంత గొప్పగా అనుభూతి చెంది రప్పరప్ప పైకి పోయాడు. వాడిది హైదరాబాదు దగ్గర్లోని మెదక్ జిల్లా జహీరాబాద్ గనుక రప్పరప్ప పోయాడు. అదే బెజవాడవాడో, గుంటూరువాడో అయియితే చకచకా పైకి వెళ్లేవాడు. ఏది ఎలా ఉన్నా యువరాజు పైకి వెళ్లడం, అక్కడ వున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ని కలవడం మాత్రం నిజం.

సెక్యూరిటీ సుపర్ (సూపర్‌వైజర్‌కి సంక్షిప్తం) యువరాజు దగ్గర ఉన్న డిగ్రీ సర్టిఫికెట్లు తీసుకుని ఓ బీరువాలో పెట్టుకున్నాడు. ఇంకో బీరువా తీసి యువ రాజుకి సరిపడా డ్రస్సు టోపీ, లాఠీ తీసి బల్లమీద పెట్టాడు. ఓ కాయితం మీద పరిగి వెళ్లే దారిలో ఉన్న ఓ దిక్కుమాలిన ఏటిఎం అడ్రసు రాసిచ్చాడు.

"ఈ జీతం మొత్తం డ్యూటీకి పోయొచ్చెటందుకే సరిపోయేట్టుంది," అన్నాడు యువరాజు.

"అవునమ్మా... నువ్వు బంజారాహిల్స్‌లో బంగళాలో దిగి, కారులో అప్ అండ్ డౌన్ చేస్తే ఈ జీతం చాలదు. అందుకే ఈ చుట్టుముట్టు ఏదైనా చిన్న రూంలో దిగి నడకన డ్యూటీకి వెళ్లొస్తే ఏమైనా మిగులు తుంది," అన్నాడు సుపర్.

"సరే సార్... ఎంతో కొంత పంపకపోతే అక్కడ ఈ పైసల కోసం మా అమ్మ, అక్క, ఇంకోడు ఆపతు ఆపతు జూస్తుంటరు," అన్నాడు యువరాజు.

"ఎవరది... మీ బాపునా?" అన్నాడు సుపర్.

"లేదు... మా బాపు బతికుండగా మిత్తికి పైస లిచ్చిన సేటు... కొడుకు," అన్నాడు యువరాజు.

*

సుపర్ చెప్పింది నిజమే అని అర్థమైంది యువ రాజుకి. సిటీకి చివరగా దిక్కు మొక్కులేని చోట, నోట్ల దెయ్యంలా ఉంది ఆ ఏటీయం. అక్కడ ఏటీయం పెట్టాలని ఆలోచన వచ్చినవాడిని ఓసారి చూడాలని పించింది యువరాజుకి.

అతడికి ఉన్న ఆస్తి అల్లా ఓ చద్దరు, మూడు జతల బట్టలు మాత్రమే. యువరాజు తన యావదాస్థితో ఆ ఏటియంలోని ఏసీలో సుఖం అనుభవిస్తూ, ఆ రాత్రి

అలా గడిపేశాడు. మర్నాడు ఉదయం అక్కడికి సమీపం లో కొన్ని ఇళ్లు కనపడ్డాయి అతడికి.

తెలుగుభాషలో అందమైన వాక్యాలు మళ్లా అతడికి కనపడ్డాయి. 'ఇల్లు-రూము బాడుగకు ఇవ్వ బడును,' అని బోర్డు ఉంది. కానీ ఆ కొంపకి తాళం వేసి ఉంది. పెద్ద ఇల్లే. కాకపోతే ఏ మెట్ల కింద గదో దొరక్కపోతుందా అనుకున్నాడు యువరాజు.

ఎదురుగా ఉన్న ఇస్త్రీబడ్డీ దగ్గర ఆరా తీస్తే ఆ ఇంట్లో చాలాకాలంగా ఎవరూ లేరనీ, తాళం మాత్రం రెండు వీధుల అవతల ఆ ఇంటి ఓనరు తాలూకు బంధువుల దగ్గర ఉందనీ చెప్పాడు ఇస్త్రీబడ్డీవాడు. పక్కనే ఉన్న బండమీద కూచుని బీడీ తాగుతున్నవాడు, "ఆ... కొంపలో దిగుతావా?" అన్నాడు ఆశ్చర్యంగా నోరు వెళ్లబెడుతూ.

"ఏం?" అని యువరాజు అడిగాడు.

అతడేదో చెప్పేలోగా ఇస్త్రీ బడ్డీవాడు అతడిని ఉరిమి చూశాడు. దాంతో వాడు నోటిని మాట్లాడ్డానికి కాకుండా కేవలం బీడీ తాగడానికి మాత్రమే వాడటం మొదలెట్టాడు.

యువరాజుకి ఇదేదో చిత్రమనిపించినా ఇప్ప డతని మనసు ఇలాంటి విచిత్రాలను పట్టించుకునే స్థితిలో లేదు. ఇస్త్రీవాడిని కనుక్కుని ఆ ఇంటి తాళం ఉన్నవాళ్ల దగ్గరికి వెళ్లాడు. అక్కడో నడివయసాయన ఉన్నాడు. బాడుగ చాలా చవుక. ఒక్క రూమ్ మాత్రం వాడుకోమని చెప్పాడాయన. కరెంటు ఎంతయితే అంత యువరాజునే కట్టుకోమన్నాడు.

ఇల్లు మొత్తం ఎవరన్నా తీసుకోడానికి వచ్చినా తను రూమ్ ఖాళీ చెయ్యక్కర్లేదన్న షరతుతో వెంటనే ఆ ఇంట్లో అద్దెకు దిగాడు యువరాజు.

ఇంటి ముందు ఖాళీజాగా చాలా ఉంది. రెండు సిమెంటు బెంచీలు కూడా ఉన్నాయి. కాకపోతే అడ్డ దిడ్డంగా పెరిగిన పిచ్చిమొక్కలు, రూమ్‌లో బూజులు అక్కడికి ఎవరూ రావడం లేదని చెబుతున్నాయి. రూమ్ వరకూ శుభ్రం చేసుకుని, చాపమీద ఛద్దరు పరుచుకుని దయ్యం కాదుకదా, ఏనుగు వచ్చి తొక్కినా లేవలే నంతగా నిద్రపోయాడు యువరాజు.

నిజానికి చింతనిప్పుల్లా రగులుతున్న రెండు కళ్లు అతడిని క్రూరంగా చూస్తున్నాయి. చల్లటి గాలి తెమ్మెర ఒకటి అతడి మీంచి వీచి గాల్లో కలిసిపోయింది.

*

వారం అయిపోయింది, యువరాజు ఉద్యోగం లో చేరి. ఆరోజు నుండీ పగలు డ్యూటీ, రాత్రి నిద్ర. రాత్రిపూట నిద్రపోవటం కూడా అదృష్టమేనని అర్థమైంది యువ రాజుకి. సాయంత్రం పూట డ్యూటీ నుండి వస్తూ వస్తూ ఓ కూర కొనుక్కొచ్చుకున్నాడు. ఇంట్లోకి పోతోంటే ఇస్త్రీవాడూ, బీడీవాడూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్లని చూసి ఓ చిరునవ్వు విసిరి లోపలికిపోయాడు.

ఇంటి ముందు కంప కొట్టేసి ఓ మూలకి లాగాడు. సిమెంటు బెంచీలని నీళ్లతో కడిగాడు. ఈశాన్యంలో వున్న కుళాయి దగ్గరే శుభ్రంగా స్నానంచేసి రూంలోకి పోయాడు. కరెంటు స్టవ్వు మీద అన్నం వండుకుని వెంట తెచ్చుకున్న కూర కలుపుకుని కడుపు నిండా తిన్నాడు.

పగలు డ్యూటీ మీద నిలబడి ఉండటం, ఆపైన కంప కొట్టడంతో వళ్లంతా అలసిపోయింది. ఆనక స్నానం చేసి అన్నం తినేసరికి కళ్లు కూరుకుపోయేలా వచ్చేస్తోంది నిద్ర. ఎంగిలి కంచం కూడా కడక్కుండా చెయ్యి అందులో కడక్కుని మూలన పెట్టేసి చాపమీద వాలి పోయాడు యువరాజు.

ఇక నిద్ర పట్టేస్తోందనుకునేసరికి ఫాను ఆగి పోయింది. లేచి స్విచ్‌లు వేశాడు. లైటు వెలిగింది. ఫాను పాడయిందేమో అనుకున్నాడు.

టప్... చిన్న శబ్దంతో లైటు ఆరిపోయింది. కరెంటు పోయిందేమో అను కున్నాడు యువరాజు. ఇంతలో నెమ్మదిగా ఫాన్ తిరగటం మొదలైంది. అతడు మళ్లా పడుకోబోయి ఆగిపోయాడు. ఫాన్ వేగం అందు కుంది. ఎంత వేగంగా తిరుగుతోందంటే ఇంకాసేపట్లో ఆ ఫాన్ వేగానికి దాని రెక్కలు ఊడిపోవడం ఖాయమని పిస్తోంది. ఒకవేళ ఆ రెక్కలు ఊడిపోకపోతే మొత్తానికి ఆ ఫానే సీలింగు నుండి ఊడిపోయి, నేలకు గుద్దుకో వడం తప్పదనిపించేలా తిరుగుతోంది. ఆ ఫాన్ కరెంటు తో తిరుగుతున్నట్టు లేదు. ఏదో కనపడని శక్తి తిప్పు తున్నట్లు ఊహాతీతమైన వేగంతో తిరుగుతోంది.

యువరాజుకి ఏం చెయ్యాలో అర్థంకాలేదు. ఫాను ఊడిపోతే ఆ బలానికి తన తల తెగిపోవడం మాత్రం తప్పదు. అతడు గుమ్మం వైపు నడిచాడు. అప్పుడు హఠాత్తుగా తలుపు తెరుచుకుంది. తెరుచు కోవడం అంటే తలుపుకున్న బోల్టు తనంత తనే ఊడిపో యింది. తలుపుని ఎవరో తోసినట్లు భళ్లున తెరుచు కుంది. యువరాజు రెండడుగులు వేశాడో లేదో అప్పుడు జరిగిందది.

ఎవరో కనపడని వ్యక్తి విసురుగా మూసినట్టు తలుపు తనంత తనుగా మూసుకుంది. బోల్టు కూడా ఎవరో పెట్టినట్టు మూసుకుంది.

యువరాజు బోల్టు తియ్యటానికి ప్రయత్నిం చాడు. కానీ అది బిగుసుకుపోయినట్టు రాలేదు. తలుపు

హేండిల్ పట్టుకుని లాగాడు. కనీసం కదలను కూడా కదల్లేదు తలుపు.

మూలనున్న ఎంగిలి కంచం గాల్లోకి ఎగిరి కింద పడింది. కంచం రెపరెప లాడుతూ కొట్టుకుంటుంటే వచ్చే ఆ శబ్దం భయంకరంగా ఉంది. కంచంలో నీళ్లు చెల్లాచెదురయ్యాయి.

యువరాజు నెమ్మదిగా రూం మధ్యలోకి, సరిగ్గా ఫాను కిందికి వచ్చాడు. ఫాను స్పీడుగా తిరుగుతున్నప్పుడు ఒకవేళ ఊడినా ఆ విసురుకి ఏదో పక్కకి వెళుతుంది. అంతే గానీ నిటారుగా పడదు. అందుకే అతను అక్కడికి చేరాడు.

అప్పుడు వికటంగా వినపడింది ఓ నవ్వు. అది ఓ స్త్రీ స్వరమని తెలుస్తోంది. కానీ చెవులు చిల్లులు పడేలా ఉంది. కర్ణకఠోరం అన్నమాట ఎందుకు వాడతారో అతడికి అప్పుడు తెలిసింది. ఈమధ్య వస్తున్న తెలుగు సినిమా పాటలు కూడా ఆ నవ్వు ముందు మధురంగానే ఉంటాయి.

అటూ ఇటూ చూస్తున్న యువరాజు ఉలిక్కిపడ్డాడు. గదిలో ఓ మూల హఠాత్తుగా ప్రత్యక్షమైంది ఓ ఆకారం. అంత చీకటిలో ఆ ఆకారం ఎలా కనపడుతుందో అతడికి అర్థంకాలేదు.

అది ఓ స్త్రీ ఆకారం. సుమారుగా ఎత్తు ఉంది ఆమె. తెల్లటి చీర గాలికి ఊగుతోంది. ఆమె జుట్టంతా విరబోసుకుని ఉంది. మేఘాలు కదులుతున్నట్లు ఆమె జుట్టు కదులుతోంది. ఆమెకు చేతులు ఉన్నాయో లేదో తెలీడం లేదు. పెద్ద కళ్లు నిప్పులు మండినట్లు మండుతున్నాయి.

చల్లటిగాలి అతడి మీది నుంచి పాకింది.

"రేయ్..." అందామె.

అతడి మెడ చుట్టూ రెండు చేతులు బిగుసుకున్నట్టు, ఊపిరి ఆడనట్టు అనిపిస్తోంది యువరాజుకి.

"చంపేస్తాను," అంది.

యువరాజుకి ఒళ్లు మండింది. ఆపైన చిరాకు వేసింది.

"అది తెలుస్తూనే ఉందిగానీ, చంపే భాగ్యానికి ఈ అల్లరంతా ఎందుకు?" అన్నాడు చిరాగ్గా.

మనిషికి దెయ్యాన్ని చూస్తే భయం. కానీ దెయ్యానికి దేన్ని చూసి భయపడాలో తెలీదు. కానీ సరిగ్గా ఇప్పుడు జరిగిందదే.

"ఏంట్రా?" అంది అతి కష్టమ్మీద.

"చంపదలుచుకుంటే నేను పడుకున్నాక నిద్రలోనే చంపొచ్చు కదా. ఈ లైటు పాడుచెయ్యడాలు, ఆ ఫాను తిప్పడాలు, తలుపులు బాదడాలు ఎందుకు? పైగా ఎంగిలి కంచం ఎత్తి పడేసినావు. ఆ ఎంగిలంతా ఎవరు ఎత్తుతాడు నీ బాబు," అన్నాడు యువరాజు చిరాగ్గా.

అప్పటివరకూ ఆమె గట్టిగా అరవగానే వాంతులు, విరేచనాలు చేసుకుంటూ పరిగెత్తిన వాళ్లనే చూసిందామె. అసలామెకి ఇంతవరకూ ఎవరికీ కనపడాల్సిన అవసరమే రాలేదు. ఆమె కాళ్లగజ్జెలు చప్పుడు చేస్తూ, ఒక్క రౌండు నైట్‌వాక్ చేస్తే చాలు, మరో ఆర్నెల్లు ఆ ఇంటి మెయిన్‌గేటును కూడా ఎవడూ ముట్టుకునేవాడు కాదు.

అంత గొప్పగా బతికిన దయ్యం ఇగో మీద ఇతడు కొట్టిన దెబ్బ మామూలుది కాదు.

తను అంత బీభత్సం సృష్టిస్తే అతడేమీ వణికిపోవడం లేదు. పైగా తను కన పడితే అతడేమీ గుండె పట్టుకుని కూలిపోవడంలేదు. ఏదో ఎల్లమ్మనో, పుల్లమ్మనో చూసినట్టు చూస్తున్నాడు. ఆమెకి హఠాత్తుగా డిప్రెషన్ వచ్చింది. ఇంత అవమానం ఆమె జీవితం (?)లో ఎప్పుడూ ఎదుర్కోలేదు.

"రేయ్... ఎవడ్రా నువ్వు? నేనేమన్నా పది రూపాయల టిక్కెట్టుతో రెండు గంటలు కనపడే సినిమా దెయ్యాన్ననుకున్నావా? మామూలు గాలిననుకున్నావా? దయ్యాన్నిరా... నిజం దయ్యాన్ని... నీ కాళ్లు వణకడం లేదురా?"

"సినిమా అయితే పైసలు కట్టి టికెట్టు కొంటాం కాబట్టి భయపడి తీరాలి... లేకపోతే డబ్బు బొక్క. నువ్వు ఫ్రీగా కనపడుతున్నావు. నేనెందుకు భయపడాలి? నువ్వు గాలివే... నాకు కాళ్లు పీకుతున్నాయి కానీ వణుకతలేవు," అన్నాడు యువరాజు తాపీగా.

"ఇది నేను కాబట్టి తట్టుకుంటున్నా... అదే ఇంకో దయ్యమయితే అవమానంతో చచ్చిపోయేది."

"నీకు నిజంగనే మైండు పోయింది... నువ్వు ఆల్రెడీ చచ్చినంకనే దెయ్యమయి నావు... మళ్లా చచ్చుడేంది... ఎట్ల చస్తవు? సరే చస్తే చావు... నాకేం బోయింది," అన్నాడు యువరాజు.

"చంపుతారా నిన్ను."

"అరే... చంపేదైతే జల్దీ చంపరాదు. ఈ మాట, ముచ్చటేంది... ఫుర్సత్‌గా చంపేదుంటే రేపురా... చంపెడిది లేకుంటే నేను కాసేపు పండుత."

"నీ మాట నాకు సగం అర్థమవుతుంది... సగం కావడం లేదు."

"నువ్వు దెయ్యానివి... నీకు అన్ని యాసలు, భాషలు తెలియాలె. మేమంటే మనుషులం పోలేంగానీ, నువ్వు గాలివి. రేపు ఏ జపానో, జర్మనీనో పోయినవనుకో,

అక్కడి భాష తెలియకపోతే ఏం జేస్తవ్? బిచ్చమెత్తు కుంటవా?''

''నీకేంటిరా ఇంత బలుపు? చావంటే భయం లేదురా?''

''మా పంతులు జెప్పెటోడు... ఆయనెవరో అన్న డంట కదా, మనదీ ఓ జిందగేనా? కుక్కలైక్క, నక్కలైక్క, గల్లీల పందులైక్క అని... అసుంటి బతుకు నాది. బతికి రోజూ చచ్చుడేనాయె. గంజుంటదా, గంజిలో ఉల్లిగడ్డ ఉంటదా అని... చచ్చినంత మాత్రాన పోయేడిదే మున్నది.''

''నిన్ను రేపు చంపుత... ఈలోగా ఏమన్నా తావీజు కట్టించుకుంటావా?''

''అయన్నీ పనిజేసెడిదుంటే ఈ ఇల్లు ఎందుకు ఇడిసి పెడతరు? మళ్లా దానికి డబ్బులు బొక్క. ఇహ నువ్వు బోతే నేను పండుకుంట,'' అన్నాడు యువరాజు.

నిరాశగా వెళ్లిపోయింది దయ్యం.

*

మర్నాడు సాయంత్రం యువరాజు రాడని ఆశ పడింది దయ్యం. నిజంగా ఆమె అనుకున్నట్టుగానే అతడు చాలా పొద్దుపోయినా రాలేదు. దాంతో అతడు తన ముందు గప్పాలు కొట్టినా నిజంగా లోపల భయ పడి పారిపోయి ఉంటాడని నిర్ధారించుకుంది.

ఆ ఆనందంలో, 'నిను వీడని నీడను నేనే,' అనే పాటని రీమిక్స్ చేసుకుని పాడి మరీ ఆనందించింది.

కానీ ఆమె ఆనందం ఎక్కువకాలం నిలువలేదు. అతడు మామూలుగానే కూర పట్టుకుని వచ్చాడు. ఆమెకి బాగా మండిన విషయం ఏమిటంటే అతడు నిన్నటి మీద హుషారుగా ఉండటం. ఈరోజు వీడ్ని చంపాల్సిందే... పోన్లే కదా అని భయపడడానికి, పారిపోడానికి టైం ఇస్తే వాడికి దాని విలువ తెలీడంలేదు అనుకుంది.

అతడి ముందు సాధ్యమైనంత భయంకరంగా ప్రత్యక్షమయ్యింది. కానీ అతడు మరీ దూరదర్శన్ చూసి నంతగా కూడా బెదరలేదు. దాంతో ఆమె బాగా నిరాశ పడింది.

''ఏరా... అకల్‌మంద్‌కో ఇషారా కాఫీ హై... అది కూడా తెలీదా దేడ్ దిమాక్... ఇంటికి ఉరికిపోక వాప సొచ్చినవ్,'' అంది.

అతడు ఆశ్చర్యంగా చూశాడు.

''ఏదో అనుకున్నగానీ... చాలా హుషారున్నవ్ నువ్వు... జల్దీ నేర్చుకున్నవ్ భాష,'' అన్నాడు మెచ్చు కోలుగా.

అతడు పొగడడంతో ఆమె సిగ్గుపడింది.

''నిన్ను చక్కగా చూడలే. కానీ... అందంగనే వున్నవ్,'' అన్నాడు మళ్లా.

ఆమె మళ్లా సిగ్గుపడింది. కానీ కర్తవ్యం గుర్తు కొచ్చి, ''ఈరోజు చావడానికి సిద్ధమా?'' అంది.

''ఆ... డబుల్ రెడీ... నిన్న చంపితే కొంచెం ఇబ్బందే,'' అన్నాడు అతను.

ఆమె ఆశ్చర్యంగా మొహం పెట్టింది.

''ఏం లే... నిన్న చస్తే... మా అమ్మ, చెల్లి ఏం చేసె టోళ్లు... నేను పైసలు పంపాల, ఆళ్లు తినాల. ఇయాల ఇన్సూరెన్సు దీసుకున్న బీస్‌లాక్... ఇరవై లక్షలు ఇస్తరు మా అమ్మకి నేను జస్తే... చంపు.''

''అరే... పాగల్... వారం తర్వాతగానీ పాలసీ ఫోర్సులోకి రాదురా.''

''పదిరోజుల కింద తారీకుతోనే తీసుకున్నలే... నువ్వు పనికానీ... అవతల అమ్మకి పైసల్తో పని ఉన్నది. రెండు లక్షలు బాకీ దీర్చి చెల్లి పెళ్లి చేసి మస్తుగ వుంటది... నువ్వు చంపు.''

''వెధవా... లత్తుకోర్... నేనేమన్నా దెయ్యాన్నను కున్నావా లేక మనిషిననుకున్నావా? డబ్బులు కోసం చంపడం, చావడం మనుషులు చేసే పనులు... నేను చంపను ఫో,'' ఆమె చాలా చిరాకుపడింది.

''అలా గుస్సా చెయ్యకు... మనిషన్నాక మాట మీద ఉండాలె... నువ్వు కూడా ఒకప్పుడు మనిషివే కదా... మనిషికున్న పాటి నీతి దయ్యానికి లేకపోతే ఎలా? నిన్న చంపుతనని, ఇయాల చంపనని మాట మారుస్తే దయ్యాల ఇజ్జత్ మూసీల కలవదా?'' అన్నాడు యువరాజు.

''నేను చంపనురా... నువ్వే చావు,'' అందామె కోపంగా.

''నా అంత నేను చస్తే పైసలు రావు. అయినా నీ మాట నమ్మి బోలెడు పైసలు కట్టి ఇన్సూరెన్సు కొన్న... చావని కాడికి ఎందుకా ఖర్చు... అనవసరంగా పైసలు బర్‌బాద్ జేయించినవు,'' అన్నాడు యువరాజు ఇంకా కోపంగా.

''ఏంరోయ్... నోరు లేస్తోంది... నేను దయ్యమను కున్నవా? లేక నీ పెళ్లామనుకున్నవా?''

''మా బాపు చెప్పెటోడు... దెయ్యం కంటె పెండ్లాం, పెండ్లాం కంటె సర్కారు భయంకరమైనవని.''

''ఇప్పుడాయన ఎక్కడున్నాడు?''

''చనిపోయాడు... మళ్లా కనపడ్లే.''

''ఎలా చనిపోయాడు?''

''గుండె ఆగిపోయి.''

''ఆయనకి తాగుడులాంటి చెడ్డ అలవాట్లు ఉండేవా?''

''అంతకంటే చెడ్డ అలవాటుండేది... వ్యవసాయం... దాంతో గుండె ఫెయిల్.''

*

వారంరోజులు గడిచేసరికి ఆమె దిగులు ఇంకా ఎక్కువయింది. యువరాజు భయపడకపోవడం అటుంచి రోజూ తనని చంపెయ్యమని వేపుకు తినడంతో అతడిని చూసి ఆమె భయపడే పరిస్థితి వచ్చింది. కానీ రోజూ అతడిని కలవడం, మాట్లాడటం మాత్రం చెయ్యకుండా ఉండలేకపోతోంది.

ఆరోజు ఆమె మరింత దిగులుగా ఉండటం చూసి యువరాజు జాలిపడ్డాడు.

''నువ్వు చాలా మంచిదానివంటగా... అందరూ చెప్పుకుంటున్నారు,'' అన్నాడు.

''ఆడవాళ్లు బతికున్నప్పుడు మీకు మనుషుల్లా కనపడరు... రోజూ ఎలా చస్తున్నా ఎవరూ పట్టించుకోరు. మనదేశంలో అయితే ఆడాళ్లు దేవతలై ఉండాలి... పూజిస్తారు. లేదా దయ్యాలై ఉండాలి... భయపడతారు. మనుషులుగా ఉంటే మాత్రం చంపేస్తారు నానా రకాలుగా,'' అందామె.

''నువ్వంత దిగులుగా ఉంటే చూడలేకపోతున్నా. ఏమన్నా ఉంటే నాతో చెప్పొచ్చుగా.''

''నీవల్లే...''

''నా వల్లా?''

''అవును... భయం లేనిచోట దయ్యం ఉండలేదు. నువ్వు అసలు భయపడటమే లేదు,'' అంది ఆమె.

యువరాజు పాపం తన శాయశక్తులా భయపడటానికి ప్రయత్నించాడు. కానీ జీవితం పెట్టే కష్టాలతో బండబారిన అతడి గుండెలో ప్రేమ ఇంకిపోలేదుగానీ భయం మాత్రం లేదు.

''సరే... నేనొచ్చి... నిన్ను ఇబ్బందిపెట్టాను... నా గురించి నువ్వు ఇబ్బందిపడొద్దు. నేనే వెళ్లిపోతాను. అయినా నువ్వు ఇక్కడ ఉండటం లేదని తెలిసిన మరుక్షణం మనుషులు ఈ ఇంటి మీద పడిపోతారు. అంత అద్దె కట్టి నేనుండలేను,'' అన్నాడు యువరాజు.

''కానీ... నిన్ను చూడకుండా నేను ఉండలేకపోతున్నా... నేను బతికున్న రోజుల్లో కూడా మా అమ్మ తప్ప నాతో ప్రేమగా ఉన్నవాళ్లెవరూ లేరు,'' అందామె బరువుగా.

''నాకు కూడా ఓ మనిషిని పెళ్లి చేసుకుని పోషించే స్థోమత లేదు... కానీ... నీలాంటి మంచి అమ్మాయి... అసలెందుకు, నువ్వు బతికుంటే నిన్నే చేసుకుందును,'' అన్నాడు యువరాజు.

''పోనీ ఇప్పుడైనా చేసుకో... పెళ్లయ్యాక ఎలానూ పెళ్లాం దయ్యంలా కనపడుతుందిగా... నీకయితే ఆ బాధ ఉండదు. ఎలాగూ దయ్యాన్ని చేసుకుంటున్నావు కాబట్టి,'' అందామె నవ్వుతూ.

''నేను రెడీ,'' అన్నాడు అతను కూడా నవ్వుతూ.

''అసలు ఈమధ్య ఇద్దరు మనుషులు చేస్తున్న కాపురాల కంటే మన కాపురం చాలా బావుంటుంది తెలుసునా? భార్య ఇండియాలో ఉంటే భర్త దుబాయిలోనో, అమెరికాలోనో ఉంటున్నాడు. ఇద్దరూ నెట్‌లో చాటింగూ, వీడియో కాలింగుల్లో కాపురం చేస్తున్నారు... అంటే నాలాంటి దయ్యాలు రెండు మాట్లాడుకున్నట్టు అది కూడా రోజూకాదు. మొగుడూ పెండ్లామూ ఆఫీసులకి పోయి అలసిపోయి వచ్చి ఒకరితో ఒకరు కాకుండా టీవీలోని నీడల్తో కాలక్షేపం చేస్తున్నారు. అదీ కాకపోతే ఫేస్‌బుక్కుని, అదని, ఇదని... అవీ నీడలే... నీడల్తో కాపురం చేస్తున్నారు. వాళ్లతో పోలిస్తే మనం కలిసి గడిపే సమయం, దానికి మనమిచ్చే విలువా చాలా ఎక్కువ,'' అంది ఆమె.

''అంటే మనుషులు దయ్యాలుగా మారారంటావా?'' అన్నాడు యువరాజు.

''అది ఎవరికి వాళ్లు ఆలోచించుకోవాలి... తాము మనుషుల్తో ఎంతసేపు గడుపుతున్నాము? నీడల్తో ఎంతసేపు? అలానే తమలో రక్తమాంసాలూ, మనసూ ఉన్న మనిషి ఎంత ఉన్నాడు? నీడగా కరిగిపోయిన మనిషి ఎంత ఉన్నాడు అని... గతంతో పోలిస్తే దయ్యాల జనాభా పెరిగింది,'' అంది ఆమె.

*

ఆ తర్వాత ఆ దయ్యమూ ఆ ఇల్లు వదిలి పోలేదు... అతడూ ఆ ఇల్లు వదిలి పోలేదు.

*నవ్య వీక్లీ, 6 మార్చి 2013*

